క్లుప్తంగా

కార్మికుల వేతనాలు పెంచాలని ధర్నా



పమిడిముక్కల: ఆశ వర్కర్ల జీతాలు పెంచాలని, రైతు సమస్యలు పరిష్కరించాలని, కార్మికుల వేతనాలు పెంచాలని పలు డిమాండ్లతో వీరంకిలాకు సెంటర్‌లో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆశ వర్కర్లు ప్లకార్డులు చేతబూని నినాదాలు చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కోసూరి శివనాగేంద్ర, ఆశ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు హేమలత, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఖాన్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన



గుడివాడ టౌన్: మానవత స్వచ్ఛంద సేవాసంస్థ సేవా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం స్థానిక బేతవోలు లోని శాంతి వృద్ధుల ఆశ్రమంలో అన్నసమారాధన నిర్వహించారు. సేవాసంఘం సభ్యుడు సీహెచ్ సత్యనారాయణ వితరణతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. సేవాసంస్థ ఉపాధ్యక్షుడు దండమూడి సీతారామస్వామి, సభ్యులు బి.రాధాకృష్ణ, జి.రామకృష్ణ, ఎం.బ్రహ్మయ్య, గంగాధర్, అలి, బి. శంకర్‌నాథ్, నవీన్ పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణల తొలగింపు



తోట్లవల్లూరు: యాకమూరులో ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆక్రమణ తొలగింపునకు అధికారులు మంగళవారం శ్రీకారం చుట్టారు. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన ఆళ్ల శ్రీనివాసరెడ్డి స్థానిక బస్‌షెల్టర్ వద్ద తోట్లవల్లూరు-ఉయ్యూరు ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిని సుమారు రెండు సెంట్లు ఆక్రమించి భవన నిర్మాణ పనులు చేపట్టాడు. దీనిపై అధికారులు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవటంతో ఆర్‌అండ్‌బీ రహదారి స్థలంలో నిర్మించిన నిర్మాణాలను తొలగించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి నాగుల్‌మీరా, ఆర్‌అండ్‌బీ ఏఈఈ మల్లికార్జున, వీఆర్‌ఓ అక్బర్ బాషా, పోలీసుల పర్యవేక్షణలో ఆక్రమణ తొలగింపు పనులను చేపట్టారు.

విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోవాలి

మండవల్లి: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు సైన్స్ ఆవిష్కరణలపై లైబ్రేరియన్ ఎస్‌కే పర్వీన మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం వారిచే పుస్తక పఠనం చేయించారు. ఆమె మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

నేటి నుంచి అయ్యప్పస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు



పామర్రు: స్థానిక సోమేశ్వరస్వామి ఆలయం పక్కన అయ్యప్ప స్వామి నూతన ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలను బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఈ నెల 21న గణపతి పూజ, 22న అష్టోత్తర శత కళశ సహిత సంప్రోక్షణ, 23వ తేదీ ఉదయం 7.41 గంటలకు ఆలయ శిఖర, విగ్రహ ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు.

కైకలూరులో తిరంగా ర్యాలీ



కైకలూరు: కైకలూరులో మంగళవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక ట్రావెలర్స్ బంగ్లా నుంచి వ్యవసాయ మార్కెట్ వరకు ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పార్టీల కంటే దేశం ముఖ్యమని భావించాలన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్‌పై జరిగిన యుద్ధంలో రాష్ట్రానికి చెందిన ఇరువురు మరణించడం బాధాకరమన్నారు. ఏలూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమ్‌కిషోర్, ఎంపీపీ అడవి కృష్ణ, కూటమి నేతలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుంతలమయంగా రోడ్లు..

ప్రయాణికుల అవస్థలు

పామర్రు: మండలంలోని పలు గ్రామాల్లో రహదార్లు గుంతలమయంగా మారాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పామర్రులోని గంగానమ్మ గుడి వద్ద నుంచి యలమర్రురోడ్డు వరకు ఉన్న ప్రధాన రహదారి గోతులమయంగా మారి రాక పోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి మొత్తం అడుగు అడుగునా గుంతలతో నిండిపోయింది. ఆ ప్రాంతంలో ప్రయాణం నరక ప్రాయంగా మారింది. వాహనాలు ఆ గోతులను తప్పించబోయి పడిపోయిన సంఘటనలున్నాయి. ప్రతిరోజూ ఈ రహదారి గుండా వేలాది మంది ప్రజలు ప్రయాణించాల్సిన పరిస్థితి. రహదారి దుస్థితిని చూసి ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులను నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.



రాళ్లు తేలిన జమీదగ్గుమిల్లి ప్రధాన రహదారి



పామర్రులో గుంతలమయంగా మారిన రోడ్డు

జమీదగ్గుమిల్లిలో..

మండలంలోని జమీదగ్గుమిల్లి గ్రామంలో ప్రధాన రహదారిపై ఉన్న కంకరు కొట్టుకు పోయి రాళ్లు పైకి తేలుతున్నాయి. మొన తేలిన రాళ్ల వలన వాహనాలు పంక్చర్లు పడటమే కాకుండా పాదచారులు నడిచేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ఏళ్లుగా ఇదే పరిస్థితి నెలకొని ఉంది.

ప్రయాణం నరకప్రాయం

స్థానిక పామర్రు-చల్లపల్లి రహదారి నుంచి నల్లగుంట వెళ్లే ప్రధాన రహదారి కొన్నేళ్లుగా గోతులు పడటంలో రాక పోకలకు ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. సుమారు కిలోమీటరు ఉన్న ఈ రహదారి అంతా గోతులతో నిండిపోయి ఉండటంతో ప్రయాణం నరక ప్రాయంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ఈ రహదారి గురించి అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు వాపోతున్నారు.

రోడ్లు జలమయం

పమిడిముక్కల: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రధాన రహదారులు, గ్రామాల్లోని అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. మంటాడ-లంకపల్లి, వీరంకిలాకు-అగినపర్రు, వీరంకిలాకు-మేడూరు, కూచిపూడి-ఐలూరు రోడ్ల పలు చోట్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల్లో వర్షం నీరు చేరి తటాకంలా మారాయి. తాడంకి అండర్‌పాస్ వద్ద భారీగా నీరు చేరింది. దీంతో రోడ్డు ఎక్కడుందో కనబడక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మర్రివాడ అంబేడ్కర్ కాలనీలో అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. డ్రెయిన్‌లు తవ్వి నీరు పోయే ఏర్పాటు చేయాలని, బ్లీచింగ్ చల్లాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



చోరగుడి వద్ద తటాకంలా మారిన మంటాడ-లంకపల్లి రహదారి

రోడ్లను బాగు చేయండి



పామర్రులో పలు రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో రాత్రి వేళల్లో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వర్షం వస్తే బురదమయంగా మారుతున్నాయి. అధికారులు, పాలకులు స్పందించి రోడ్లను బాగుచేయించాలి.

– లక్ష్మి, పామర్రు

ఇబ్బందికరంగా ప్రయాణం



మండలంలోని పలు గ్రామాల్లో రహదార్లు అధ్వానంగా ఉన్నాయి. కొన్ని చోట్ల రహదారులు గోతులమయంగా మారటంతో ప్రయాణం ఇబ్బందికరంగా మారుతోంది. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– ఓ గంగాధర ప్రసాద్, సీపీఎం నాయకుడు

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

తోట్లవల్లూరు: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. రంగారావు డిమాండ్ చేశారు. ఈ విషయమై సీఐటీయూ ఆధ్వర్యంలో తోట్లవల్లూరులో మంగళవారం నిరసన ప్రదర్శన జరిగింది. స్థానిక ఆటో స్టాండ్ సెంటర్లో రంగారావు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించాలని, కౌలు రైతుల రక్షణకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కంభం కొండలబాబు, నాయకులు జుజ్జవరపు ఏసోబు, వల్లూరు స్వరూపరాణి, చాగంటిపాటి సుబ్బారావు, ఈడ్పుగంటి డేవిడ్‌రాజు, అంబటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తోట్లవల్లూరులో నిరసన ప్రదర్శనలో రంగారావు, కార్మికులు

కార్మిక సంఘాలు ధర్నా

గుడివాడ టౌన్: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక కొత్త మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు కార్మికులు ర్యాలీగా వెళ్లి కార్యాలయం ముందు కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని రైతులకు గిట్టుబాటు ధర చట్టబద్ధం కల్పించాలి కోరారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి, ఏఐటీయూసీ నాయకుడు గూడపాటి ప్రకాష్, సీహెచ్ సత్యన్నారాయణ, కె. సురేష్, పి. రజిని, ఆదిలక్ష్మి, కృష్ణకుమారి, భవాని పాల్గొన్నారు.



గుడివాడ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

పామర్రులో..

పామర్రు: కేంద్రం ప్రభుత్వం పెట్టుబడిదారులైన అదాని, అంబానీలకు ఊడిగం చేస్తూ కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఒడుగు గంగాధర ప్రసాద్ ఆరోపించారు. స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద కార్మికులు నిరసన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను బలవంతంగా కార్మిక వర్గాలపై రుద్దటానికి కంకణం కట్టుకున్నారన్నారు. నాయకులు వేము పెదబాబు, నాగభూషణం, ఇంటిరాజు, శివనాగు, లక్ష్మణ, అంజమ్మ, నాగ సావిత్రి, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.



మొవ్వ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన

మొవ్వలో..

మొవ్వ: కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ మండల కార్యదర్శి కాకి రాజశేఖర్, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొడాలి శ్రీనివాస్ రావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల వైస్ ప్రెసిడెంట్ ఏనుగు శ్రీనివాసరావు, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు దేవామణి తదితరులు పాల్గొన్నారు. వీరికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం నారాయణరావు సంఘీభావం ప్రకటించారు.



పామర్రు కూడలి వద్ద నిరసన

ఉపాధి చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

కలిదిండి (కైకలూరు): ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం నిధులు పెంచి పటిష్టంగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ సమస్యలు పరిష్కరించాలని ప్రజా సంఘాల దేశవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం కలిదిండి ఎంపీడీఓ కార్యాలయం, మూలలంక, భాస్కరరావుపేట, సానారుద్రవరం, గ్రామ సచివాలయాల వద్ద నిరసన తెలిపి వినతి పత్రాలు అందించారు. సీఐటీయూ మండల కార్యదర్శి జక్కుల మహేష్, ప్రజా సంఘాల నాయకులు వి.భాస్కరరావు, సీహెచ్.శ్రీకాంత్, బి.రామనాగేంద్రం, పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కలిదిండలో సీఐటీయూ నాయకుల నిరసన

పద్యాలపై అవగాహన



జమీగొల్వేపల్లి(పామర్రు): మండలంలోని జమీగొల్వేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా మంగళవారం వేమన, సుమతి శతక పద్యాలపై ఉపాధ్యాయురాలు పి.పద్మావతి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు నీతి కథలను చెప్పారు. గ్రంథాలయ అధికారి వి.నాగసురేష్ పాల్గొన్నారు.

పామర్రులో..

స్థానిక ద్వితీయ శ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను నిర్వహించామని గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీ రాణి తెలిపారు. .

విద్యార్థులకు వేమన పద్యాలు

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు మంగళవారం వేమన శతకంలోని పద్యాల గురించి వివరించారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి విద్యార్థులతో పద్యాలు చదివించి, వాటి భావాన్ని తెలిపారు. నీతి కథలు బోధించారు. అనంతరం ఇండోర్ గేమ్స్ ఆడించి అల్పాహారాన్ని పంపిణీ చేశారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిత్యాన్నదాన ప్రసాదానికి సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ ఆర్ గంగాశ్రీదేవి పర్యవేక్షించారు.

మినీ మహానాడులో కొల్లేరు సమస్యలు ఏకరువు

కైకలూరు: పార్టీ ఆదేశాలతో కైకలూరు సీతారామఫంక్షన్ హాల్లో మంగళవారం జరిగిన టీడీపీ మినీ మహానాడులో కొల్లేరు సమస్యలను నాయకులు ఏకరువు పెట్టారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి కొత్త నాగేంద్రకుమార్, మెంటే పార్థసారథి, వీరముల్లు నరసింహారావు ఆధ్వర్యంలో మినీ మహానాడు నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లేరు సాధికారిత కన్వీనర్ బలే ఏసురాజు మాట్లాడుతూ కొల్లేరులో సొసైటీలు, ఆపరేషన్ సమయంలో కొట్టేసిన అదనపు భూముల పంపిణీపై సుప్రీం కోర్టులో మరో రెండు పిటీషన్లు వేయాలని కోరారు. మండవల్లి మండలం పెనుమాకలంక, ఇంగిలిపాకలంక రహదారిని నిర్మించాలని చెప్పారు. వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు వినోద్, మాల్యాద్రి, రత్నారావు, శ్రీనివాసరావుపాల్గొన్నారు.

వైభవంగా సుందరకాండ హోమం

బంటుమిల్లి: పాశ్చాపురంలోని శ్రీ సువర్చలాంజనేయస్వామి ఆలయంలో సుందరకాండ హవనము(హోమం) మంగళవారం వైభవంగా జరిగింది. హనుమజ్జయంతి ఉత్సవాల్లో రెండో రోజు ద్వారకా తిరుమల వేద పాఠశాల అధ్యాపకులు డీవీ మేఘ నరసింహాచార్యులు సుందరకాండ పఠనం చేస్తూ అందులోని శ్లోకాల అర్థాలను వివరిస్తూ నిర్వహించిన హోమం భక్తుల మనస్సులను రంజింప చేసింది. ప్రధాన అర్చకులు హనుమంతాచార్యులు పర్యవేక్షణలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం కోలాట బృందం వేసిన మురళీ కోలాటం భక్తులను ఆకట్టుకుంది.

అకాల వర్షాలు.. అన్నదాతకు అవస్థలు

తోట్లవల్లూరు: అకాల వర్షాలు మొక్కజొన్న రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. కొన్ని రోజులుగా తరచూ కురుస్తున్న వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తోట్లవల్లూరు తోపాటు పలు గ్రామాల్లో మంగళవారం వేకువజామున భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం సుమారు రెండు గంటలపాటు పడింది. వర్షంతో ప్రధాన రహదారులపై నీరు నిలిచింది. అంతర్గత రోడ్లు చిత్తడిగా మారాయి. వర్షంతో లంకల్లోని పలు ప్రాంతాల్లో మొక్కజొన్న ఆరబెట్టిన రైతులు అవస్థలకు గురవుతున్నారు. చేతికొచ్చిన పంట ఎక్కడ దెబ్బతింటుందోనని కలవరపడుతున్నారు. పరదాలతో కల్లాల్లో పంటను కాపాడుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వాతావరణం ఇబ్బంది పెడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం కారణంగా పండించిన పంట ఏమౌతుందోనని ఆందోళనగా ఉందని అంటున్నారు.



తోడేళ్లదిబ్బలంకలో మొక్కజొన్నను పరదాలతో కప్పిన రైతులు



తోడేళ్లదిబ్బలంకలో మొక్కజొన్నను ఆరబెడుతున్న రైతు

పామర్రులో భారీ వర్షం

పామర్రు: పామర్రులో మంగళవారం తెల్లవారు జామునుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు భారీ వర్షం కురిసింది. వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయంగా మారాయి. పామర్రు-చల్లపల్లి ప్రధాన రహదారి, అరండాల్‌పేట, బాపూజీ పేట, చౌదరి పేట, గాంధీ నగర్ తదితర ప్రాంతాల్లోని రహదారులపై వర్షం నీరు నిలిచిపోయింది.

మొవ్వలో..

మొవ్వ: మొవ్వలో మంగళవారం వేకువజామున నుంచి సుమారు నాలుగు గంటలు భారీ వర్షం కురిసింది. 50.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండలంలోని పలు లోతట్టు ప్రాంతాలు, పలు ప్రధాన రహదారులు జలమయమయ్యాయి.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదాచారులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



పామర్రు-చల్లపల్లి రహదారిలో నిలిచిన వర్షం నీరు

బాల్య వివాహాలను అరికట్టాలి

కురుమద్దాలి(పామర్రు): బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పెదమద్దాలి క్లస్టర్ సూపర్‌వైజర్ ఎస్.విజయకుమారి పేర్కొన్నారు. మండలంలోని కురుమద్దాలి-2 అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా బాలికలకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్త హీనత వలన కలిగే నష్టాలను వివరించారు. మహిళా పోలీస్ సుకన్య, సచివాలయ ఏఎన్‌ఎం వీరాంజనేయులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచండి

కాజ(మొవ్వ): పరిసరాలు, వ్యక్తిగతంగా పరిశుభ్రంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వై పుణ్యవతి సూచించారు. కిశోరి వికాశం సమ్మర్ క్యాంప్‌లో భాగంగా మంగళవారం కాజ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-5లో కిశోరబాలికలకు, గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏడబ్ల్యూహెచ్‌ఏస్‌లు ఎం.మరియమ్మ, బి.సుధ, బి.నాగనిరీషా పాల్గొన్నారు.



కాజలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ పుణ్యవతి

సమ్మె వాయిదా విచారకరం

గుడివాడ టౌన్: కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈ నెల 20వ తేదీన నిర్వహించాల్సిన సమ్మెను వాయిదా వేయడం విచారకరమని శ్రామిక హక్కుల పోరాట సంఘం నాయకులు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన కార్మిక సంఘాలు పిలుపు మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పడానికి సిద్ధమైన నేపథ్యంలో దిగువస్థాయి కమిటీలకు సమాచారం లేకుండా అపరేషన్ సిందూర్ కారణంగా వాయిదా వేయడం విచారకరమన్నారు. కార్మిక హక్కుల పోరాటం అధ్యక్షుడు ఆర్. రఘు, ఆటోనగర్ ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ నాయకులు లక్ష్మణరావు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘ నాయకులు

కోతుల బెడద నివారించాలని కోరుతూ ధర్నా

చినముత్తేవి(మొవ్వ): అధికారులు కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని చినముత్తేవి గ్రామస్తులు మంగళవారం పంచాయతీ కార్యాయలం వద్ద ధర్నా చేశారు. సచివాలయంలో గ్రామస్తుల సంతకాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. చినముత్తేవి గ్రామంలో గత ఏడాదిగా కోతులు బెడద పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామస్తులు మాదాసు నాగులు, కే మల్లిక, ఎస్ వెంకటేశ్వరమ్మ, రంగమ్మ, సుబ్బలక్ష్మి, మణి, కుమారి, నాగేశ్వరమ్మ, శ్రీలక్ష్మి, కోటేశ్వరమ్మ, జయలక్ష్మి, శంకరరావులతో పాటు సీపీఎం మండల కార్యదర్శి శీలం నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.



చినముత్తేవి పంచాయతీ వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

గ్రామీణ వైద్యులను ప్రభుత్వ సేవలకు వినియోగించాలి

కైకలూరు: గ్రామీణ వైద్యులకు శిక్షణ అందించి ప్రభుత్వ వైద్యసేవల్లో ఉద్యోగులుగా అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్, బేసిక్ హెల్త్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ సంఘ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఆర్‌ఎంపీ, పీఎంపీలపై దాడులు జరుగుతున్నాయని, ప్రభుత్వం ప్రత్యేక చట్టంతో రక్షణ కల్పించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే కామినేని స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకువెళతానని తెలిపారు. గుడివాడ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, సంఘ ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నందూరి ఉమాశంకర్, ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు సాగిరాజు ఉదయభాస్కరరాజు పాల్గొన్నారు.